సొదుం జయరాం కథలు

**27**

# త్రిశంకు స్వర్గం

నీళ్ళబిందె, వెన్నెల రాత్రిళ్లూ, మల్లెపూలు, నొక్కుల జుత్తూ, వీటిలో ఒకదాని కొకటి సంబంధం లేకపోయినా, వీటిలో దేన్ని చూచినా, బాలాంబగారికి పాత జ్ఞాపకాలు కళ్ళముందు మెదులుతాయి. ఆ జ్ఞాపకాలు వెనక బాధ తప్ప ఆనందం లేదు. అదంతా తన యవ్వనంలో జరిగిపోయిన ఒక సుందర స్వప్నం. ఆ సుందర స్వప్నం అడపాదడపా హృదయాంతరాల్లోంచి బయటికి తొంగిచూస్తూనే ఉంటుంది, తనకు ఇష్టం లేకపోయినా.

ఇవ్వాళ తన కూతురు జయలక్ష్మి మూలంగా పాతజ్ఞాపకాలు మళ్ళీ బాలాంబగారి కళ్ళముందు మెదిలాయి.

సాయంత్రం ఎవరో అబ్బాయి జయలక్ష్మి వెంట వచ్చాడు. కాసేపు జయలక్ష్మితో పిచ్చాపాటి మాట్లాడి వెళ్ళిపోయాడు. తన కూతురు ఆ అబ్బాయితో అట్లా చనువుగా మాట్లాడటం బాలాంబగారికి ఎందుకో అసహ్యంగా కనిపించింది.

'ఎవరే ఆ అబ్బాయి?' అన్నది.

'మా కాలేజీలో చదువుతున్నాడు. నా క్లాసే' అంది. కూతురు సమాధానంలో నిర్లక్ష్యం బాలాంబగారికి చురుక్కున తగిలింది.

'నీ క్లాసయితే మట్టుకు ఇంటి దగ్గరకు రావలసిన అవసరమేమిటి?' అన్నది.

'అవసరముంటే తప్ప రాకూడదేమిటి?' అన్నది జయలక్ష్మి ముఖం చిట్లించి.

కూతురు నోటంట, బాలాంబగారు ఆశించిన సమాధానం అదికాదు. అందువల్ల ఆవిడకు అరికాలిమంట నెత్తికెక్కింది. నాజూగ్గా మందలించడానికి బదులు ఘాటుగా నాలుగు అంటించింది. జయలక్ష్మి ఇక నోరెత్తలేక పోయింది. గుడ్లనీరు కుక్కుకుంటూ వెళ్ళి మంచంకి కరుచుకు పడుకుంది.

గోడగడియారం తొమ్మిది కొట్టినా జయలక్ష్మి అన్నానికి లేవలేదు. కూతుర్ని వదలి అన్నం తినడానికి ఆవిడకు మనస్కరించలేదు. బ్రతిమాలి అన్నానికి పిలవడానికి బాలాంబగారికి ఇంకా కోపం తగ్గలేదు జయలక్ష్మి మీద.

వెళ్ళి బయట కూర్చుంది. పుచ్చపువ్వవంటి వెన్నెల. అనుకోకుండానే ఆవిడకు గత స్మృతులు కళ్ళముందు కలిపించాయి.

అవును. అప్పుడు తనకు జయలక్ష్మి వయసే. జయలక్ష్మి కన్నా అందంగా ఉండేదేమో తను.

లేకపోతే సుందరం తనకోసం అంత ఇదయ్యేవాడా? సుందరం కొత్తగా టీచరుగా వచ్చాడు ఆ వూరికి, నొక్కుల జుత్తు, కంటికి అద్దాలు - రంగు కొంచెం నలుపైనా చలాకీగా చూడముచ్చటగా ఉండేవాడు. ఎప్పుడూ సిగరెట్టు పెదవుల మధ్య కాలుతుండేది.

సాయంత్రమయ్యే సరికి, వూరి బయటికి చెరువుగట్టంట షికారుకు వచ్చేవాడు.

బిందె చంకనేసుకొని, సరిగ్గా ఆ సమయానికే వచ్చేది తను. నీళ్ళ కనికాదు - సుందరాన్ని చూడడానికి.

తీరా అక్కడికి వెళ్ళాక దించిన కళ్ళు పైకి లేవవు. చచ్చే సిగ్గు. గబగబా నీళ్ళు ముంచుకొని వెనక ఎవ్వరో తరుముతున్నట్లు నడిచేది.

వెనకవైపు సుందరం తన్ను చూస్తున్నాడేమో......... కళ్ళెత్తి చూద్దామంటే కళ్ళూ కళ్ళూ కలుస్తాయని భయం. వెనకాల తన్ను సుందరం చూస్తున్నాడనుకునేసరికి - సిగ్గుతో ఒళ్ళంతా కుంచించుకుపొయ్యేది.

రాత్రి పడుకుంటే సుందరం కళ్ళల్లో మెదిలేవాడు. హృదయంలో తేనెటీగల్లా తియ్యటి వూహలు లేచేవి.

మొదటిరోజు తనతో మాట్లాడటం ఇప్పటికి నిన్నా మొన్నా జరిగి నట్టుంటుంది.

నీళ్ళు తీసుకొని వస్తున్నది తను. తన వెనకే వస్తున్నాడు అతను.

ఎవ్వరన్నా చూస్తే? ఎందుకో భయంవేసింది తనకు. కాళ్ళు తొట్రుపడుతున్నాయి.

'బాలాంబా మీ పేరు?' వెనకనుంచి అడుగుతున్నాడు. తను అవును అనలేదు. కాదు అనలేదు. ఏమనడానికీ గొంతు పెగల్లేదు. చెక్కిళ్ళు ఎరుపు చేసుకుంది.

నాజూగ్గా నవ్వి సుందరం ముందు నడిచిపోయాడు. అతని నోటంత వచ్చిన ఆ ఒక్క మాటా, తన కన్నె మనసులో రేపిన కలవరానికి, ఆనందానికి అవధులు లేకపొయ్యాయి.

ఆ రాత్రి చల్లటి వెన్నెల్లో పక్కా కుదరక, నిద్రా రాక, తెల్లవార్లూ జాగరణ చేసింది.

తెల్లవారి లేచి అద్దంలో చూసుకుంటే కళ్ళు జ్యోతుల్లా ఉన్నాయి. అయినా ఆ కళ్లల్లో ఏదో కొత్త కాంతి తొంగి చూస్తోంది.

మొత్తానికి సుందరం గడుసువాడే.

మరుసటిరోజు మళ్ళీ వెంటపడ్డాడు. ఏదో మాట్లాడుతాడన్నది తనకు తెలుసు మాటకు ఎట్లా సమాధానం చెప్పాలో మనసులో రిహార్సల్స్ చేసుకొంటోంది తను.

'తలలో అన్నిపూలు పెట్టారే బరువనిపించదూ?' ఊహించని ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే గడుసుదనం తనకి లేదు. పూలే బరువయితే..........వచ్చే నవ్వును ఆపడానికి తను పెదిమలు బిగపట్టింది.

కుచ్చెళ్ళూ ఎత్తిపట్టుకున్న చెయ్యి తీసి పూలు తడుముకుంది.

'మీ తల్లో పూలు లాక్కుంటానని భయమా?'

అన్నీ కొంటె ప్రశ్నలు. దేనికీ సమాధానం చెప్పలేదు తను. ఏమనుకుంటాడో ఏమో? వయ్యారంగా మెడ పక్కకి తిప్పి నవ్వి నడక వేగం హెచ్చించింది.

'వెనక ఎవరో తరుముతున్నట్టు అట్లా నడుస్తారెందుకు. చీర చూడండి ఎట్లా తడిసిందో!'

నిజమే – పక్క మీది చీరంతా తడిసి వంటి కాంతి బయట పడుతోంది. సిగ్గూ, కోపమూ రెండూ కలిగాయి. తక్కున ఆగి 'ఆడపిల్లల వెంట నడవటం సరదా ఏమిటి మీకు? ముందు వెళ్ళండి' అన్నది.

సుందరం ముందుకెళ్ళి నవ్వాడు. ఎంత ఆపుకున్నా పెదిమలమీద తనకూ నవ్వు నిల్చింది.

ఆ రాత్రి కళ్లు మూసుకుంటే – మంగళ వాయిద్యాలు-మంత్రాలూ చెవుల్లో హోరెత్తాయి. పడుకునే, కొత్త పెళ్ళికూతురిలా సిగ్గుపడి వంటినిండా రగ్గు కప్పుకుంది.

పెళ్ళి చేసుకుంటాడేమో? చేసుకోక పబ్బం గడుపుకోడానికైతే తను అంగీకరిస్తుందేమిటి? ఎట్లా తెలుసుకోవడం! కన్నె మనసులో తియ్యటి ఆశ అడగటానికి సాహసాన్నిచ్చింది.

'నాన్న కట్నం ఇవ్వలేరు. పెళ్ళి చేసుకుంటారా?' అడిగింది ఒకరోజు.

'కట్నం అవసరం లేదు. నువ్వు చాలు'.

బాలాంబ కళ్ళతో తప్ప – నోటితో కృతజ్ఞతని వెల్లడి చెయ్యలేకపోయింది.

తన కన్నెచెర వదిలించడానికి పడుతున్న అవస్థ గ్రహించలేనంత పసిదేమీ కాదు తను. పైకి వ్యక్తం చెయ్యకపోయినా, నాన్న తన విషయంలో పడుతున్న బాధ తనకి తెలుసు.

తనుగాక ముగ్గురాడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు, పొలాలమీద వచ్చే ఆదాయమూ అంతంత మాత్రమే, పైగా బాకీలు, సంసారం ఎట్లా ఈడ్చుకువస్తున్నాడో తనకు తెలుసు.

సుందరం విషయం చెబితే సంతోషిస్తాడు. విషయం చెప్పడానికి

రెండు మూడు రోజులు తికమకపడి, ఎట్లాగైతేనేమి కడకు బయట పెట్టింది.

విని – సంతోషించలేదు. తన్ను అందలం ఎక్కించలేదు. తల బాదుకున్నాడు. ముఖంనిండా అసహ్యం పులుముకొని – తిట్లు లంకించుకొన్నాడు. అడ్డుపడ్డందుకు అమ్మకు నాల్గంటించాడు.

తనలో చేతనంలేదు. ఆయన ఏమి తిడుతున్నాడో కూడా వినిపించడం లేదు. పరువు, ప్రతిష్ట, వంశగౌరవం ఇట్లాంటి పదాలు అస్పష్టంగా విన్నట్లు జ్ఞాపకం.

ఇల్లు జైలుఖానా అయింది తనకు, తన ముఖం చూడటానికే కంటగింపులు, అమ్మా, నాన్నా ముఖాలు పక్కకు తిప్పుకుంటున్నారు.

మూడు రోజులు ఏడుపుతప్ప అన్నం నిద్రాలేదు తనకి. ఏం తప్పు చేశానని తనకీ శిక్ష వేశారో అంతుపట్టలేదు.

'చూడు అమ్మడూ మనం ఉంటున్నది త్రిశంకు స్వర్గం. ఇందులో అడుగుతీసి అడుగుపెడితే తప్పు. ఎట్లా తప్పవుతుందో అడగకూడదు. అన్నీ సహించడం నేర్చుకోవాలి. అంతకన్న గత్యంతరం లేదు.'

తన అవస్థ చూసి ఓదార్చడానికి వచ్చిన పక్కింటి పిన్నిగారన్న మాటలవి. ఆవిడి ఏమి చెప్పినా తన బుర్రకు అర్థంకాదు. ఆమె ట్రైనింగ్ పాసయింది. అయినా ఉద్యోగం చెయ్యడం లేదు. ఆమె భర్తా టీచరే.

'పిన్నీ నువ్వు ఉద్యోగం చెయ్యకూడదూ?' అన్నది ఒకరోజు.

'మీ చిన్నాన్న వద్దంటున్నారే' అన్నది.

'ఏం తప్పా?' అన్నది తను.

ఆరోజూ ఇలాగే చెప్పింది. ఇవ్వాళ మళ్ళీ అదేమాట అంటున్నది. తనకి అర్థం కాలేదు.

మూణ్ణెళ్లు తిరక్కుండానే, నాన్న సంబంధం ఖాయం చేశాడు. సంబంధం ఖాయం చెయ్యడానికి మూడెరకాల పొలం అమ్ముతున్నప్పుడు కూడా నాన్నలో పెద్ద బాధ కనిపించలేదు. వూరికే సుందరం పెళ్ళి చేసుకుంటానంటే – ఆయన తనదంతా ఎవ్వరో కొల్లగొడుతున్నట్లు బాధ పడ్డాడు!

పెళ్ళి అయినాక బాలాంబ సుందరాన్నీ, నాన్న తిట్లనీ అన్నీ మరచిపోయింది.

ఇవ్వాళ జయలక్ష్మి మూలాన అదంతా జ్ఞాపకం వచ్చింది.

జయలక్ష్మి ఏం తప్పుచేసిందని తను దండించినట్లు? నరాల్లో జీర్ణించుకుపోయిన సాంప్రదాయం. అంతకన్నా ఏంలేదు.

బాలాంబ చప్పున లేచి, జయలక్ష్మి మంచం దగ్గరికి వెళ్ళింది. ఎంతగా ఏడ్చిందో కళ్ళు వాచివున్నాయి. ఏడుస్తూనే ఎప్పుడో నిద్రపోయింది. బాలాంబ కనుగొనుకుల్లో నీళ్ళు నిలిచాయి. జయలక్ష్మిని చిన్న పిల్లలా గుండెల కదుముకొని తనూ పడుకుంది.

**- (1966, ఆంధ్రపత్రిక వీక్లీ)**